ప్రజాశక్తి
ఆదివారం 3 సెప్టెంబర్ 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

రూ.కోటి పైనే రుణ కుంభకోణం

- 70 మంది మహిళలను మోసం చేశారు..
- వారం రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే నిరవధిక దీక్షలు
- విచారణకు వచ్చిన మెప్మా పీడీతో ఐద్వా, సిపిఎం నేతలు
- పాత్రధారులపై కేసు నమోదు చేయిస్తాం: పీడీ



విచారణ చేస్తున్న మెప్మా పీడీ

ప్రజాశక్తి-రేపల్లె

70 మంది మహిళలను మోసం చేసి... కోటి రూపాయల పైనే రుణాల కుంభకోణం జరిగిందని, వారం రోజులు సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించి.. బాధిత డ్వాక్రా గ్రూపు సభ్యులకు న్యాయం చేయకపోతే బాధితులతో కలిసి నిరవధిక నిరాహారదీక్షలు చేపడతామని ఐద్వా, సిపిఎం నేతలు తెలిపారు. దొంగ లోన్ల కుంభకోణంపై విచారణ మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటనారాయణ శనివారం విచారణ చేపట్టారు. ఇప్పటికే ఈ సమస్యపై ఐద్వా ఆధ్వర్యంలో సిపిఎం మద్దతుతో పలు రూపాలలో ఆందోళనలు చేశారు. ఎంపీ మోపిదేవి వెంకటరమణరావుకి శనివారం వినతిపత్రం ఇచ్చిన నేపథ్యంలో శనివారం మెప్మా పీడీ విచారణకు వచ్చారు. సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ ▶ 2లో

నేడు 'సమరభేరి' బహిరంగ సభ

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రాక



వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి ప్రచారజాతా ముగింపు సందర్భంగా ఆదివారం సాయంత్రం నాగులుప్పలపాడులోని బస్టాండ్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీకాంత్ తెలిపారు. సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సభకు ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

మూడు నెలల్లోనూ..

లోటు వర్షపాతం



నీళ్లు లేక ఖాళీగా ఉన్న పొలాలు

- 210.8 మి.మీ.లకు గానూ 146.5 మి.మీ.ల వర్షం
- 2 మండలాల్లోనే అధికం..
- 6 మండలాల్లో సాధారణం
- మిగతా 30 మండలాల్లో లోటుతో పంటల సాగు 22 శాతమే..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లాలో నాలుగేళ్ల తర్వాత కరువు పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. వర్షాభావం రబీపైనా ప్రభావం చూపేలా ఉంది. ఖరీఫ్ దాదాపుగా చేజారినట్లే.. 20 శాతంలోపే పంటల సాగు ఉంది. 80 శాతం చేజారింది. వీటి నష్టం ఆర్థికంగా చూస్తే రూ.1500 కోట్లకు పైగానే ఉంటుంది. భారీగా ఉత్పత్తులను కోల్పోయినట్లే.. ఖరీఫ్‌లో అంతా వర్షాధారంపైనే పంటల సాగు ఉంది. ఈ ఏడాది జూన్ నుంచీ వర్షం సరిగా లేదు. ఇప్పటికీ లోటు కొనసాగుతోంది. 48.4 శాతం లోటు తేలింది.

మూడు నెలలుగా సరైన వర్షాల్లేక పంటల సాగు లేదు. 5.36 లక్షల ఎకరాలకు గానూ 94 వేల ఎకరాల్లో పంటల సాగు జరిగినట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇవి కూడా ఎండుముఖం పట్టాయి. నువ్వు పంట మాత్రం కొన్ని ప్రాంతాల్లో పీకారు. నూర్పిడి చేయాల్సి ఉంది. మిగతా పంటలన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. ఏదీ ఆశాజనకంగా లేదు. రైతుల ఆశలు ఆవిరయ్యాయి. రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక వ్యవసాయ కూలీలకు పనులు లేకుండా పోయాయి. ఖరీఫ్‌లో ప్రతి పంటలోనూ ఎకరాకు కనీసం 50 రోజులు పనులు దొరికేవి. ఇప్పుడు ఏ పనిచేయాలన్నా పంటల సాగే ఆశాజనకంగా లేదు. వ్యవసాయ కూలీలు ముఖ్యంగా మహిళలు ఏ పని లేకుండా ఖాళీగా ఉన్నారు. ఉపాధి హామీ పనులు కూడా నిలిపేశారు. వ్యవసాయ సీజన్ మొదలు కావడంతో వాటిని ప్రాధాన్యత ఉండదు. దీంతో ఏ పనీ లేక పట్టణాలకు వలసలు వస్తున్నారు. కూరగాయలు అమ్మడం, కాయలు అమ్ముకోవడంపై ఎక్కువగా పేద కుటుంబాలు ఆధారపడుతున్నాయి. పట్టణాల్లో ▶ 2లో

ప్రకాశం జిల్లాలో వర్షపాతం ఇలా..

నెల	సాధారణ వర్షపాతం	కురిసింది	లోటు
జూన్	57.9 మి.మీ.లు	45.1 మి.మీ.లు	- 22.1
జూలై	87.8 మి.మీ.లు	85.2 మి.మీ.లు	- 3.0
ఆగస్టు	92 మి.మీ.లు	16.2 మి.మీ.లు	- 75.1

- 20 నుంచి 59 శాతం అదనంగా కురిసిన మండలాలు - 2
- సాధారణ వర్షపాతం నమోదైన మండలాలు - 7
- 20 నుచిచీ 59శాతం లోటు ఉన్న మండలాలు - 28
- 60 నుంచి 99 శాతం అంటే భారీ లోటున్న మండలాలు - 1

పంటల సాగు..

- ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం - 536442 ఎకరాలు
- ఇప్పటి వరకూ సాగు - 1,17,984 ఎకరాలు (22 శాతం)


జగన్‌తో పలు సమస్యల గురించి మాట్లాడుతున్న మజీద్

జగన్‌ను కలిసిన మజీద్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆయన తండ్రి వర్ధంతి రోజైన శనివారం కడప జిల్లా ఇడుపులపాలయ వచ్చిన సందర్భంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో దోర్నాలకు చెందిన వైసిపీ మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ మజీద్ మర్యాద పూర్వకంగా కలిశారు. పలు సమస్యలు ముఖ్యమంత్రి ధృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

జేఎన్టీయూ ఇసి మెంబర్‌గా డాక్టర్ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

కాకినాడ కేంద్రంగా ఉన్న ప్రఖ్యాత జెఎన్‌టియు విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా డాక్టర్ వెన్నా కష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యాలయం నుంచి అధికారికంగా ఉత్తర్వులు అందాయి. డాక్టర్ వి. కృష్ణారెడ్డి ప్రస్తుతం గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు చెందిన కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఆయన ఇసి మెంబర్‌గా మూడు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగుతారు. ఇసి మెంబర్‌గా నియమితులైన డాక్టర్ వెన్నా కష్ణారెడ్డిని విద్యా సంస్థల అధినేతలతో పాటు పలువురు ప్రముఖులు అభినందించారు.

టిడిపి ప్రచార కార్యక్రమం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కూనపురెడ్డి వెంకటసుబ్బారావు, మాజీ వైస్ ఎంపీపీ కూనపురెడ్డి వెంకటహైమావతి ఆధ్వర్యంలో ఇంటింటికి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు రానున్న ఎన్నికల్లో వచ్చిన వెంటనే మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అబ్దుల్ సుబాహాన్ వలేటి రవిశంకర్‌రెడ్డి, ఆళ్ల నాగమణి తదితరులు ఉన్నారు.


ప్రచార కార్యక్రమంలో టిడిపి నాయకులు

మూడు నెలల్లోనూ లోటు వర్షపాతం

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు కూరగాయలు, పండ్లు అమ్మే తోపుడు బండ్లు పెరిగాయి. కారణం గ్రామాల్లో పనుల్లేవు. ఉపాధి లేదు. దీంతో పేదలు ఎక్కువశాతం సమీపంలోని పట్టణాలకు వచ్చి చిరువ్యాపారాలు చేసుకుంటున్నారు. కౌలు రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కౌలుకు తీసుకున్నా ఫలితం లేదు. దీంతో ముందుకుపోలేక.. వెనక్కు రాలేక సందిగ్ధంలో ఉన్నారు. ముందుగానే ఒప్పందాలు చేసుకుంటేనే కౌలుకు పొలాలు ఇస్తారు. ఇప్పుడు కరువు వల్ల కౌలు రైతులు కూడా ఎక్కువశాతం మంది ఖాళీగా ఉన్నారు. కరువు మళ్లీ అన్ని రంగాలపై ప్రభావం చూపుతోంది. ఎరువులు, విత్తనాల దుకాణాలు కొనుగోళ్లు లేవు. వ్యాపారులపైనా ప్రభావం పడింది.

ఒంగోలు వర్షం

ఒంగోలు నగరంలో శనివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇటీవల ఎండలతో అల్లాడిపోయిన జనం వర్షంతో సేదతీరారు. ఒంగోలుతో పాటు మద్దిపాడు, సంతనూతలపాడులో వర్షం కురిసింది.

రూ.కోటి పైనే రుణ కుంభకోణం

(మొదటిపేజీ తరువాయి)

మెప్మా సిబ్బంది అవినీతి, నిర్లక్షం వల్లే ఆర్పీ ఇంత పెద్ద కుంభకోణానికి పాల్పడిందని పీడీ దష్టికి తీసుకెళ్లారు. సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ పేద మహిళలను, చదువురాని వారిని, పర్సనల్ లోన్స్‌కి మీరు శాంక్షన్ అయ్యారంటూ.. బ్యాంకులు దగ్గరికి తీసుకెళ్లి.. దొంగ గ్రూపులని ఆర్పీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్పటి మెప్మా సిబ్బంది సివో, మెప్మా మేనేజర్ అండదండలతో ఆర్పీ తన కుటుంబసభ్యుల సహకారంతో సుమారు 70మంది మహిళలను మోసం చేసి.. కోటి రూపాయల పైన కుంభకోణం చేసినట్లు చెప్పారు. పది రోజుల నుండి సంబంధిత రేపల్లె మెప్మా కార్యాలయం సిబ్బంది దష్టికి సమస్యను తీసుకెళ్లినా చర్యలు తీసుకోకపోవటంతో దీని వెనక మెప్మాలో పెద్దలు ఉండి ఉంటారనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. కుంభకోణంలో పాత్రధారులైన మెప్మా సిబ్బంది ముగ్గురు, ఆర్పీ, ఆర్పీ కుటుంబసభ్యులు నలుగురు మొత్తం ఎనిమిది మందిపై కేసులు పెట్టాలన్నారు. అదేవిధంగా తీసుకోని లోన్లు కట్టాలని ఒత్తిడి చేస్తున్న బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి, మహిళలపై వేధింపులు ఆపించాలన్నారు. సంక్షేమ పథకాలకు విడుదలైన డబ్బులు వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారం రోజులు సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కారం చేయకపోతే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరవధిక నిరాహార దీక్షలు చేపడతామని ఐద్వా నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో రేపల్లె మెప్మా సిటీ మేనేజర్ సిఎంఎం విజయ, మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి, సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్, ఐద్వా నాయకులు షేక్ ఆశా, షేక్.జహీద్, షబానా సుల్తానా పాల్గొన్నారు.

పాత్రదారులపై కేసు పెట్టిస్తాం..

కుంభకోణంలో పాత్రధారులుగా ఉన్న మెప్మా సిబ్బందిపై, ఆర్పీ కుటుంబ సభ్యులపై కేసు బుక్ చేయిస్తామని మెప్మా పీడీ తెలిపారు. సంబంధిత మెప్మా సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వాళ్ల పాత్ర నిజం అని తేలితే సస్పెండ్ చేయటానికి కూడా వెనకాడబోమన్నారు. బ్యాంకర్స్‌తో మాట్లాడి పేద మహిళలపై ఒత్తిడి లేకుండా వారి సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఒకే గ్రూప్ పేరుతో వివిధ బ్యాంక్‌లలో మహిళా సంఘాల పేరుతో రుణాలు ఇప్పించిన వారిపైనా, అక్రమంగా రుణాలు తీసుకున్న వారిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట నారాయణ కమ్యూనిటీ మిషన్ మేనేజర్ విజయను ఆదేశించారు. శనివారం మెప్మా సిబ్బంది, బాధిత మహిళలను విచారించారు. జగనన్న తోడు, ఆసరా పథకాల పేరుతో గ్రూపు మహిళలను మోసం చేశారని గుర్తించారు. రోషిణి, అప్సరా, అప్సని, షాహీన, బిస్మిల్లా, రామకష్ణ, శ్రీ నాగేశ్వరి, తేజ, జరీనా, ఫైజుల్లా, మహిళ పొదుపు సంఘాల గ్రూపుల పేరుతో అక్రమంగా రుణాలు తీసుకున్న వారిపైనా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఎస్సీ కాలనీ వాసులు శనివారం ధర్నా నిర్వహించారు. గత రెండు రోజుల క్రితం తమ కాలనీలో విద్యుత్ స్తంభం విరిగిపోయిందన్నారు. దీంతో కరెంటు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. విద్యుత్ సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో ధర్నా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న విద్యుత్ ఏఈ నరేంద్రరెడ్డి అక్కడకు చేరుకొని సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అయినప్పటికీ మహిళలు ధర్నాను వీడలేదు. ఎస్సై అంకమరావు జోక్యం చేసుకొని మీకు సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానని మహిళలు నచ్చ జెప్పడంతో శాంతించారు. ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఆదివారం 3 సెప్టెంబర్ 2023

అనారోగ్యంతో బాలిక మృతి

గిద్దలూరు రూరల్ :గిద్దలూరు మండలం పోదల కొండపల్లె గ్రామానికి చెందిన మద్ది కాని వెంకట మధుప్రియ(16) శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. .బాలిక తల్లయిన వెంకటలక్ష్మితో కలిసి గిద్దలూరు నుంచి నరసరావుపేట వెళ్లేందుకు గిద్దలూరు రైల్వే స్టేషన్‌కు వచ్చారు. స్టేషన్‌లో అనుకోకుండా మధుప్రియ కింద పడిపోవడంతో వెంటనే 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మధుప్రియ మరణించినట్లు డాక్టర్లు తెలిపారు.

ఉరేసుకొని మహిళ మృతి

కంభం రూరల్ : పట్టణానికి చెందిన బంగారు వ్యాపారి సోమిశెట్టి రాజా భార్య జయ(30) ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం వెలుగు చూసింది. భార్య భర్తల మధ్య తరచుగా ఘర్షణలు జరిగేవని, శుక్రవారం సైతం ఘర్షణ జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆమె ఉరి వేసుకొని మతి చెందడం పలు అనుమానాలకు దారి తీస్తుంది. కంభం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కేసులు నమోదు

కొండపి : కొండపి పోలీసు స్టేషన్‌లో రెండు కేసులు నమోదు అయినట్లు ఏఎస్ఐ అంకాలరావు తెలిపారు. మండలంలోని పెట్లూరు గ్రామానికి చెందిన డి.బాలబ్రహ్మయ్య, ఎన్.మదన్ ఇద్దరు కలిసి పూటుగా మద్యం సేవించారు. ఈ క్రమంలో మత్తులో ఇద్దరి మధ్య మాట మాట పెరగడంతో మదన్ కర్రతో డి.బాలబ్రహ్మయ్య తల పగలగొట్టాడు. మదన్ కాలుకు గాయమైంది. ఇరు వర్గాల పిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇదే విదంగా రెండు బైకులు డీకొన్న సంఘటనలో కూడా చినకండ్లగుంట గ్రామానికి చెందిన మల్లాల కోటేశ్వరరావు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'రైల్వే సిగ్నలింగ్' కాపర్ కేబుల్ చోరీ

ప్రజాశక్తి-దొనకొండ


గుంటూరు గుంతకల్లు రైలుమార్గంలో జరుగుతున్న సిగ్నలింగ్ పనులకు సంబందించి మునుమాక, వినుకొండ ప్రాంతాల్లో దాదాపు రూ.55వేలు విలువ చేసే కాపర్ కేబుల్ చోరీకి గురైంది. దీంతో డివిజనల్ సెక్యూరిటీ కమీషనర్ సత్యహరప్రసాద్ ఆదేశాల మేరకు గుంటూరు, నర్సరావుపేట, పిడుగురాళ్ల ఆర్పీఎఫ్ సీఐల బృందం అనేక చోట్ల చోరీపై దర్యాప్తు నిర్వహించారు. వారి దర్యాప్తులో రైల్వే కాంట్రాక్టర్ వద్ద పనిచేసే సైట్ సూపర్‌వైజర్ల కొందరు చోరీలో పాత్రదారులుగా గుర్తించి విచారణ చేపట్టారు. వారి విచారణలో దొంగలించిన కేబుల్‌ను దర్శిలో పాత ఇనుపకొట్టు నిర్వహిస్తున్న భీమవరపు లక్ష్మయ్యకు విక్రయించినట్లు నిర్ధారణ అయింది. దీంతో కోర్టు నుంచి సెర్చ్ వారెంట్ పొంది దర్శిలోని లక్ష్మయ్య ఇనుప గోడౌన్‌ను తనిఖీ చేశారు. ఆ తనిఖీల్లో 40వేల మీటర్లు గల భారీ మొత్తంలో రైల్వే సిగ్నలింగ్ కేబుల్ స్టాక్ ఉండటం గుర్తించారు. పూర్తిస్థాయిలో పరిశీలించి కేబుల్ అధికారుల ద్వారా దాదాపు రూ.80 లక్షల విలువచేసే కేబుల్ ఉన్నట్లు నిర్ధారించి మొత్తం స్టాక్ స్వాదీనం చేసుకొని సీజ్ చేసి లక్ష్మయ్య అతని వద్ద పనిచేసే ఇద్దరు, సైట్ సూపర్‌వైజర్లు ఇద్దరు మొత్తం ఐదుగురిపై కేసు నమోదు చేసి రైల్వే కోర్టులో హాజరుపర్చనున్నట్లు రైల్వే ఆర్పీఎఫ్ అధికారులు వెల్లడించారు. ఈ బృంధంలో గుంటూరు క్రైమ్ ఎస్సై కె ఖాదర్‌బాష, నర్సరావుపేట, దొనకొండ ఆర్పీఎఫ్ ఏఎస్సైలు షేక్ సుభానీ, క్రాంతికుమార్, పలువురు ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కారు ప్రమాదంలో పంచాయతీ రాజ్ ఉద్యోగి మృతి



ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఆర్టీసీ బస్సు కారు ఢీ కొన్న ఘటనలో పంచాయతీ రాజ్ ఉద్యోగి సిహెచ్‌వి నాగేశ్వరరావు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని తిప్పాయపాలెం గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. మార్కాపురం డివిజనల్ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు(53) శనివారం తన స్వగ్రమం అయిన కంభం పట్టణం నుంచి విధులకు హజరైయ్యాందుకు తన వ్యక్తిగత వాహనంలో మార్కాపురంకు బయలుదేరారు. ఈ క్రమంలో మార్కాపురం నుంచి గిద్దలూరు వెళుతూన్న ఆర్టీసీ బస్సు ప్రయాదవశాత్తు కారును ఢీకొట్టింది. కారు నడుపుతూన్న నాగేశ్వరరావుకు బలమైన గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందారు. ఆర్టీసీ బస్సులో 18 మంది ప్రయాణికులు ఉండగా నలుగురి త్రీయ గాయాలైయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు హుటహుటీన క్షతగాత్రులను 108 వాహనం ద్వారా మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న మార్కాపురం గ్రామీణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఎస్ఐ ఎం వెంకటేశ్వరనాయక్ తెలిపారు. సహ ఉద్యోగి మృతి పట్ల పంచాయతీ రాజ్, జిల్లా పరిషత్, మండల పరిషత్ ఉద్యోగులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.


నాగేశ్వరరావు (ఫైల్)

వైద్యం వికటించి గర్భిణీ మృతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వైద్యం వికటించి గర్భిణీ మహిళ మృతి చెందిన సంఘటన యర్రగొండపాలెంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం పల్నాడు జిల్లా వెల్లుర్తి మండలం దావుపల్లి గ్రావ వానికి చెందిన వంకరబోయిన నాగలక్ష్మి(27) కాన్పు కోసం శుక్రవారం యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చేరింది. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో సిజేరియన్ ఆపరేషన్ చేసి బిడ్డను తీశారు. పుట్టిన మగ బిడ్డ అనారోగ్యంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఆ పసికందును గుంటూరు తరలించారు. కాగా ఆపరేషన్ చేయించుకున్న నాగలక్ష్మి శుక్రవారం రాత్రి సమయంలో మృతి చెందింది. దీంతో ఆమె బంధువులు ఆసుపత్రి వద్దకు చేరి ఘర్షణకు దిగారు. కొద్దిసేపు రోడ్డుపై బైఠాయించారు. అయితే వైద్యులు మాత్రం సిజేరియన్ ఆపరేషన్ చక్కగా జరిగింది. తల్లి కండీషన్ బాగుంది. ప్రతి అరగంటకు వచ్చి చూస్తూనే ఉన్నాము. గుండె పట్టుకోవడంతో మరణించి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆపరేషన్ చేసిన విషయంలో ఎలాంటి తప్పిదాలు దొర్లలేదని చెప్పారు. ఆపరేషన్ జరిగిన తీరంతా బంధువులకు తెలియజేయడంతో వారంతా చేసేదేముంది. తమ కర్మ అంటూ నాగలక్ష్మి మృతదేహాన్ని తీసుకెళ్లారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సిఐ మారుతీకృష్ణ ఆధ్వర్యంలో పుల్లలచెరువు ఎస్సై వై శ్రీహరి పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

కాపురానికి పిలిచినందుకు కొట్టారు

ప్రజాశక్తి-కొండపి

భార్యను కాపురానికి రమ్మని అడిగినందుకు అత్తగారి కుటుంభసభ్యులు మల్లిఖార్జునను కొట్టారని కొండపి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమెదు అయ్యింది. వివరాల్లోకి వెళ్లగా కట్టావారిపాలెం గ్రామానికి చెందిన తన్నీరు మల్లిఖార్జునరావు భార్య పుట్టింటి నుంచి ఇంకా రాకపోవడంతో పోన్ చేసి రమ్మని అడిగాడు. దీంతో అత్తమామలు ఎందుకు ఇన్ని సార్లు పోన్ చేస్తున్నావు అని చెప్పి కట్టావారిపాలెంలోని పిర్యాదు దారుడు ఇంటి వద్దకు వచ్చి దాడి చేశారు. ఈ దాడిలో మల్లిఖార్జునకు తలకు బలమైన గాయం అయ్యింది. అతను కొండపి ప్రభుత్వ వైద్యశాలలో చేరగా ప్రథమ చికిత్స అందించి డాక్టర్లు మెరుగైన వైద్యంకై ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఆ మేరకు రిమ్స్ ఆసుపత్రి నుంచి అందిన పిర్యాదుతో కొండపి పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐ అంకారావు కేసు నమోదు చేశారు.

నందనవనంలో చోరీ

శింగరాయకొండ : జరుగుమల్లి మండలం నందనవనం గ్రామంలో బీరువా పగలగొట్టి నగదు చోరీ అయిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. శనివారం ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం... నందనవనం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ లక్ష్మీ నరసయ్య అనే వ్యక్తి ఇంట్లో అర్ధరాత్రి సమయంలో బీరువా పగలగొట్టి రూ.35వేలు తీసుకువెళ్లినటు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీంతో పోలీసులు వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చీరాల : గుర్తుతెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చీరాల ఒంగోలు బైపాస్ రోడ్డు లోని మన్నం అపార్ట్మెంట్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. వేటపాలెం మండలం సమైక్య నగర్‌కు చెందిన యలవర్తి క్రాంతి(30) అనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై చీరాల నుంచి వేటపాలెం వెళ్లేందుకు బైపాస్ రోడ్డులో వెళ్తుండగా మన్నం అపార్ట్మెంట్ వద్ద వేగంతో ప్రయాణిస్తున్న గుర్తుతెలియని వాహనం ఒక్కసారిగా ఢీ కొట్టింది.దీంతో వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం గమనించిన స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు సిబ్బంది నిర్ధారించారు.సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు మృత దేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం శనివారం ఒంగోలు నగరంలో ఘనంగా జరిగింది. ముందుగా వైసిపి జిల్లా కార్యాలయంలో వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చర్చి సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి, దివంగత ఐపిఎస్ అధికారి జాన్‌వెస్లీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే బాలినేనితోపాటు మాజీ మంత్రి, శిద్దా రాఘవరావు కూడా పాల్గొన్నారు. తరువాత గాంధీనగర్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ బిసిసెల్ జిల్లా అధ్యక్షులు గోలి తిరుపతిరావు ఆధ్వర్యంలో విశ్వసేవిక ట్రస్టు వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో వైసిపి యువనాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి, వైసిపి నగర కన్వీనర్ కటారి శంకర్, నగర మేయర్ గంగాడ సుజాత, ఒడా ఛైర్మన్ శింగరాజు మీనా కుమారి, కార్పొరేటర్లు ఈదర వెంకట సురేష్ బాబు, యనమల నాగరాజు, వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, తదితరులు పాల్గొన్నారు. సూపర్ బజార్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి సూపర్ బజార్ ఛైర్మన్ తాతా బదరీనాథ్, వైసిపి యువనాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి, ఎండీ జి కుమార్, పాలకవర్గ సభ్యులు మురళి,తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక 30వ డివిజన్ గద్దలగుంట మూడు బొమ్మల సెంటర్‌లో నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, వైసిపి యువనాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కాశీ మహింతి చంద్రకళ, వైసిపి నాయకులు నాని, తదితరులు పాల్గొన్నారు. **గిద్దలూరు :** వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా గిద్దలూరు శాసన సభ్యులు అన్నా రాంబాబు పట్టణంలోని రాచెర్ల గేట్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, జడ్పీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీ లు, ఎంపీటీసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ వర్ధంతి పురస్కరించుకుని శనివారం పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ నాయకులు చేరెడ్డి వెంకటేశ్వర రెడ్డి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.. అనంతరం సివీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో చేరెడ్డి జయరామిరెడ్డి, మహానంది యాదవ్, దిలీప్‌కుమార్‌రెడ్డి, రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **దరిశి:** వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా గడియార స్తంభం సెంటర్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు మద్దిశెట్టి రవీంద్ర, పలువురు వైసిపి నాయకులు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. **కొనకనమిట్ల :**కొనకనమిట్ల మండలంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి శనివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మురళీకృష్ణ, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, మండల కన్వీనర్ మోర శంకర్‌రెడ్డి, సర్పంచ్ శిగినం లక్ష్మీ తిరుపతమ్మ, ఎంపిటిసి కల్లం సుబ్బమ్మ, మండల ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **శింగరాయకొండ:** వైయస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలు శింగరాయకొండ మండలంలో ఘనంగా శనివారం నిర్వహించారు. కందుకూరు రోడ్డు వద్ద నిర్వహించిన వేడుకలకు కొండేపి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వరికూటి అశోక్‌బాబు హాజరయ్యి. వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసిన వాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్ రెడ్డి, యన్నబత్తిన వెంకటేశ్వరరావు, యనమల మాధవి తదితరులు ఉన్నారు. **యర్రగొండపాలెం:** యర్రగొండపాలెం పట్టణంలో వైఎస్ రాజశేఖరరెడ్డి వర్దంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానికంగా గల వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్పిటిసి చేదూరి విజయ భాస్కర్, సర్పంచ్ రామావత్ అరుణాబాయి తదితరులు పాల్గొన్నారు. **చీమకుర్తి :** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.శనివారం స్థానిక బూచేపల్లి కల్యాణమండపం సమీపంలోని వైఎస్‌రాజశేఖరరెడ్డి విగ్రహానికి, ఎన్ఎస్‌పి కాలనీ సెంటర్‌లోని విగ్రహానికి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లివెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లిశివప్రసాదరెడ్డి పాల్గొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో జడ్‌పిటిసి వేమాశ్రీనివాసరావు, ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, మండల వైసిపి కన్వీనర్ పమిడివెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు కె శేఖరరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ చల్లా అంకులు, వైఎస్ ఛైర్మన్ బి వెంకటరెడ్డి పాల్గొన్నారు. **టంగుటూరు :** వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను మండలంలోని పలు గ్రామాలలో వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక బస్ స్టాప్ సెంటర్ లోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


ఒంగోలులో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే


గిద్దలూరులో వైఎస్సార్‌కు నివాళులు

వ్యవసాయానికి 9 గంటలు కరెంటు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - పంగులూరు

కరెంట్ సక్రమంగా ఇవ్వకపోవడంతో వ్యవసాయ పంటలు పూర్తిగా ఎండి పోతున్నాయి. వ్యవసాయానికి 9గంటలు కరెంటు ఇచ్చి ఆదుకోవాలని కోటపాడు, కొండమంజులూరు గ్రామాల రైతులు కోరారు. ఆ గ్రామాల్లోని సచివాలయాల్లో పంచాయతీ సెక్రెటరీకి, వీఆర్వోలకు శనివారం సిపిఎం ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఖరీఫ్‌లో మొక్కజొన్న, మిర్చి, కూరగాయలు మొదలైన పంటలను సాగు చేశామని, వర్షాలు లేక, కరెంటు సక్రమంగా రాక బోర్ మోటర్లు ఆడక, పంటలు ఎండిపోతున్నాయని రైతులు తెలిపారు. కనీసం రెండు గంటలు కూడా వ్యవసాయ మోటార్లకు కరెంటు ఉండటం లేదని తెలిపారు. విద్యుత్ అధికారులను అడిగితే తాము చేయగలిగేది ఏమీ లేదని అంటున్నారని తెలిపారు. సిపిఎం కార్యదర్శి తలపనేని రామారావు, నాయకులు గుడిపాటి మల్లారెడ్డి, రైతులు గుంటుపల్లి పెద్ద అంజయ్య, ఏలూరు మస్తాన్‌రావు, బోరుగడ్డ బుజ్జిబాబు, కృష్ణారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పెదపులిపర్రు సచివాలయంలో సిపిఎం వినతి



కారంచేడు తహాశీల్దారు వద్ద సిపిఎం ధర్నా

భట్టిప్రోలు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన ధరలకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరిలో భాగంగా శనివారం పెదపులివర్రు సచివాలయంలో సిపిఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. 4న తాసిల్దార్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాలో ప్రజలు పాల్గొనాలని కోరారు. సిపిఎం నాయకులు మురుగుడు సత్యనారాయణ, జి నాగరాజు, రాంబాబు పాల్గొన్నారు.

మెదరమెట్ల : స్థానిక ఎస్టీ కాలనీకి గత 20రోజుల నుండి తాగునీరు రావడం లేదని, వెంటనే నీరు అందించాలని మేదరమెట్ల సచివాలయంలో సిపిఎం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని ఈవోఆర్డీకి అందజేశారు. గతంలో అధికారుల దృష్టికి తెచ్చినా పరిష్కరించలేదని సిపిఎం కార్యదర్శి ఎం ఆంజనేయులు అన్నారు. ట్యాంకర్ల ద్వారా అయినా తాగునీళ్ల ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వై రవీంద్రబాబు, వైకుంఠం, జయమ్మ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

కారంచేడు : సిపిఎం సమరభేరిలో భాగంగా తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. స్థానిక ఆర్‌సిఎం చర్చి పక్కన ఉన్న యానాది కాలనీ వాసులకు తాము ఉంటున్న స్థలంలోనే పట్టాలు ఇవ్వాలని తహశీల్దారు ఎస్ వెంకటరత్నంకు వినతిపత్రం ఇచ్చారు. 15ఏళ్ల క్రితం తుఫాను సందర్భంగా పునరావాసం కింద అప్పటి కలెక్టర్ ఉదయలక్ష్మి సర్వే నంబర్ 948/1లో స్థలాలు చూపారని, స్థలం బాగు చేసుకున్నట్లు బాధితులు చెప్పారు. ఆ స్థలంలోనే తమకు నివేశన స్థళ పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి కొండయ్య, శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రముఖ వైద్యులు ప్రకాశరావు మృతి

ప్రజాశక్తి - రేపల్లె



డాక్టర్ ప్రకాశరావు (ఫైల్)

పట్టణంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ వేజళ్ళ ప్రకాశరావు(84) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. గత 50సంవత్సరాలుగా పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ సేవా దృక్పదంతో పని చేస్తూ ప్రజల మన్ననలు పొందారు. సేవకు మారుపేరుగా నిలిచిన డాక్టర్ వేజళ్ళ ప్రకాశరావు మృతి చెందడం బాధాకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి అన్నారు. వేజళ్ళ ప్రకాశరావు మంచి హస్తవాసి గల డాక్టర్ అని, అతి స్వల్ప ఫీజు, అతి తక్కువ మందులు, సరైన రోగ నిర్ధారణ ఆయన ప్రత్యేకతని తెలిపారు. నాణ్యమై వైద్య సేవలు అందించి మంచి డాక్టర్‌గా పేరు పొందారని అన్నారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్, బిఎల్‌కె ప్రసాద్, ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ డాక్టర్ వేజళ్ళ ప్రకాశరావు మృత దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



ఎన్నికల సామాగ్రి పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఎన్నికల సామగ్రికి పటిష్ట భద్రత : కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

ఎన్నికల సామగ్రి అయిన ఈవీఎం, వివిప్యాట్స్ యంత్రాలకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఈవీఎం, వివిప్యాట్స్ గోడౌన్‌ను ఆయన శనివారం పరిశీలించారు. హర్యానా నుంచి 4,620 వివిప్యాట్స్ యంత్రాలు, బెంగళూరు నుంచి 4,200 సియు యంత్రాలు జిల్లాకు అందడంపై కలెక్టర్ ఆరా తీశారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు ఈవీఎం, వివి పాట్స్ యంత్రాలను సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఇప్పటివరకు జిల్లాకు వచ్చిన యంత్రాలను పటిష్టమైన భద్రతతో గోదాములో ఉంచాలన్నారు. ప్రతి యంత్రం కోడ్ నెంబరును ఆన్‌లైన్‌లో పరిశీలించి, గోదాములో భద్రపర్చాలని అన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో వాటిని గోదాముల్లో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ జి రవీందర్, ఎన్నికల పర్యవేక్షకులు కృష్ణ కాంత్, తహసిల్దార్ సంధ్యారాణి పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలివ్వాలి

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

ఇంటర్మీడియట్ విద్యార్థులకు వెంటనే పాఠ్య పుస్తకాలు అందించాలని ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా కార్యదర్శి ఆర్య కోరారు. పివి పాలెం మండలంలోని విద్యా సంస్థలను ఆయన శనివారం సందర్శించారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెస్తున్నామని చెప్పుకుంటూ ఇంటర్ విద్యార్థులకు గత మూడు సంవత్సరాలుగా పాఠ్య పుస్తకాలు ఇవ్వడంలేదన్నారు. ప్రైవేటు కళాశాలలకు అనుమతులు ఇచ్చి విద్యార్థులను ప్రైవేటు విద్య వైపు నెట్టే ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. కళాశాలలో నాడు నేడు పనులు ఆగిపోయాయని అన్నారు. అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కనీసం తాగునీటి వసతి కూడా లేదని చెప్పారు. ప్రభుత్వ సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు అందరికీ అమ్మ ఒడి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

యుద్ధం చేయాల్సి వస్తే తరిమికొడతాం

◆ ప్రశాంతతకు భంగం కిలిగిస్తే సంహించను: కరణం వెంకటేష్



మీడియాతో మాట్లాడుతున్న వెంకటేష్

ప్రజాశక్తి - చీరాల

ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకోమని వైసిపి ఇంచార్జి కరణం వెంకటేష్ అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా స్థానిక గడియార స్తంభం సెంటర్లోని వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసినివాళి అర్పించారు. ఈ సందర్భంగా కరణం మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్ తండ్రి బాటలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళగా భావించి పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. సిఎం జగన్ బాటలో చీరాలను ప్రశాంతంగా ఉంచుతూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని అన్నారు. ఎవరి పనివారు చేసుకుంటే మంచిదని అన్నారు. ప్రశాంతంగా ఉన్న చీరాలపై ఎక్కడో ఉండి నోరు జారడం సరికాదని అన్నారు. దమ్ముంటే ఎదురు పడాలని అన్నారు. గతంలో మాదిరి వైసీపీ నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే తరిమికొడతామని అన్నారు. రౌడీ రాజ్యం చేయడానికి ఇప్పుడు కుదరదని అన్నారు. రాముడు లాంటి బలరామ కృష్ణమూర్తి ఉన్నారని అన్నారు. ప్రశాంతతకు భంగం కలిగిస్తే బిగించుకోడానికి పనికి రాకుండా నట్లు ఉడగొడతామని పరుషంగా మాట్లాడారు. గతంలోలాగ బెదిరింపు రాజకీయాలు సహించేది లేదన్నారు. ఇదే పార్టీలో ఉంటూ కుట్ర రాజకీయాలు చేస్తే ఎలా ఎదుర్కోవాలో చూపిస్తామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ బోనిగల జైసన్ బాబు పాల్గొన్నారు.



వాలంటీర్లతో మాట్లాడుతున్న మంత్రి మేరుగ

వాలంటీర్లు బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చేందుకు ఏర్పాటు చేసిన వాలంటీర్లు బాధ్యతగా పనిచేయాలని మంత్రి మెరుగు నాగార్జున కోరారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం వాలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు పదకాలు అందిచే బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. సంక్షేమ పదకాల అమలుతో జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో భట్టిప్రోలు సర్పంచ్ ధర రవికిరణ్మయి, సర్పంచ్ బూర్ల రాంప్రసాద్, కార్యదర్శి కోట శ్రీనివాసరావు, నాయకులు చెన్నయ్య, గాలి అరవింద, పి అరుణశాస్త్రి, కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పురవేదిక నిర్మించాలి

ప్రజాశక్తి - రేపల్లె : రెవెన్యూ డివిజన్ కేంద్రంగా రూపుదిద్దుకున్న పట్టణంలోని నెహ్రూ విగ్రహం వద్ద పురవేదిక నిర్మిం చాలని జైభీం భారత పార్టీ కన్వీనర్ దోవా రమేష్ రాంజీ కమీషనర్ బందెల విజయ సారధికి వినతి పత్రం అందజేశారు. ఓపెన్ థియేటర్ నందు నూతన కళా వేదికను నిర్మించాలని కోరారు. ఆంధ్రరత్న మునిసిపల్ హై స్కూల్ నందు కొత్త సభా వేదికను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జైభీం పార్టీ మండల కన్వీనర్ కర్రా బాబురావు, పోతార్లంక శివ వెంకటేశ్వరావు, నెరుసు వెంకటరావు నాయుడు, మండే యాకోబు పాల్గొన్నారు.

కలెక్టర్ సహకారంతోనే కుందేరు పూడ్చే పనులు

సీఎంకు మాజీ మంత్రి డాక్టర్ పాలేటి బహిరంగ లేఖ



సిఎంకు బహిరంగ లేఖతో డాక్టర్ పాలేటి

ప్రజాశక్తి - చీరాల

సహజ సిద్ధంగా చీరాల ప్రాంతంలో ఏర్పడ్డ కుందేరు డ్రైన్ వెయ్యి మీటర్ల విస్తీర్ణం ఉంటే కేవలం 9మీటర్లు సరిపోతుందంటూ కుందేరును పూడ్చే స్తున్నారని మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు పేర్కొన్నారు. కుందేరు ఆక్రహలను తొలగించి పూడిక తీసి నీటి పారుదలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని గతంలో కలెక్టర్‌కు చేసిన వినతులను గాలికి వదిలేశారని అన్నారు. నీటి పారుదల వనరులను ఇతర అవసరాలకు వాడవద్దని సుప్రీం కోర్టు స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ ప్రభుత్వ నిధులతో కుందేరును పూడ్చడం వెను కలెక్టర్ సమకారం ఉందని అన్నారు. పూడిక తీసేందుకు నిధులు లేవంటూనే పూడ్చడానికి నిధులు ఎక్కడి నుండి తెచ్చారని ప్రశ్నించారు. అభివృద్ధి పేరుతో కుందేరును కలెక్టర్ సహకారంతో పూడ్చి వేస్తున్నారని, దీనిపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జోక్యం చేసుకుని పనులు నిలిపేయాలని కోరుతూ ఆయన సిఎంకు బహిరంగ లేఖ రాశారు. తన హాస్పటల్లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో బహిరంగ లేఖ వివరాలను వెల్లడించారు. కుందేరుకు 100మీటర్ల దూరంలో నివాసం ఉంటున్న కలెక్టర్‌కు అన్నీ తెలిసే సహకరిస్తున్నారని అన్నారు. ఆక్రమణలకు వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమాలు జరుగుతున్నప్పటికీ లెక్క చేయకుండా డ్రైనేజీ, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు కుందేరును పూడ్చివేసే పనులు చేస్తున్నారని అన్నారు. ఇప్పుడు పూడ్చే పూడికను తొలగించాలంటే మళ్లీ నిధులు ఎక్కడి నుండి వస్తాయని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పూర్తి విచారణ జరిపి పూడిక పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దేవరపల్లి బాబురావు, కటకం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మౌంట్ ఫోర్ట్‌లో ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - రేపల్లె : పట్టణంలో మౌంట్ ఫోర్ట్ పాఠశాలలో ఫుడ్‌ఫెస్టివల్‌కు 100మంది పేరెంట్స్ వివిధ రకాల సాంప్రదాయ వంటలను ప్రదర్శించారు. కార్యక్రమాన్ని రేపల్లె విచారణ గురువులు ఫాదర్ ప్రసాద్ ప్రారంభించారు. పాఠశాల కరస్పాండెంట్ ప్రిన్సిపల్ బ్రదర్ కిరణ్ మాట్లాడుతూ జంక్‌ఫుడ్‌తో పోశకాలున్న ఆహారాన్ని మర్చిపోతున్న ప్రస్తుత తరుణంలో సాంప్రదాయ వంటకాల ప్రాధాన్యతను తెలిపేందుకే కార్యక్రమం చేపట్టామన్నారు. వంటలు కొనుగోలు ద్వారా వచ్చిన నగదును సమాజ సేవలకు వినియోగిస్తామన్నారు.

ఓటర్ల తొలగింపు పారదర్శకంగా చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఓటర్ల జాబితాలో తొలగింపుల విషయంలో జిల్లా కలెక్టర్ రంజిత్ భాష గ్రామాలలో సుడిగాలి పర్యటన చేశారు. శనివారం మండలంలోని గుల్లపల్లిలో మృతి చెందిన, తొలగించిన ఓటర్ల జాబితాల ప్రకారం ఆయన వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. గుల్లపల్లిలోని శృతి నర్సింగ్ కళాశాలలో వివిధ రాష్ట్రాలకు చెందిన నర్సింగ్ విద్యార్థులు గతంలో చదువు తుండగా ఓటర్లుగా నమోదు చేయించుకున్నారు. ఇప్పుడు వారందరూ స్వస్థలాలకు వెళ్లడంతో వారి ఓట్లను జాబితా నుండి తొలగించారు. ఆయన కళాశాలకు వెళ్లి కాలేజీ యాజమాన్యంతో మాట్లాడి జాబితాలను నిర్ధారించారు. బూత్ లెవల్ అధికారులు సక్రమంగా విధులు నిర్వహించాలని అన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీవో జె పార్థసారథి, తహసిల్దార్ బి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ఈ విజయబాబు, పాల్గొన్నారు.



ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కారంలో మోడీ విఫలం: సిపిఎం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో తలపెట్టిన సమరభేరి ప్రచారజాతా శనివారం నాగులుప్పలపాడు మండలం చేరింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య మాట్లాడుతూ అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ చార్జీల భారంతో ప్రజలు తల్లడిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాద మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలో, ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు రాయితీలు కల్పిస్తూ సామాన్యుల నడ్డివిరుస్తోందన్నారు. మోడీకి భజన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో విద్యుత్ చార్జీలు ఈపాటికే 7సార్లు పెంచి ప్రజలపై భారాలు మోపుతోందన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటున్నాయన్నారు. మోడీ గద్దెనెక్కిన నాడు గ్యాస్ ధర రూ.450 ఉండగా ప్రస్తుతం రూ.1200కు పెంచారన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య

వస్తే ధరలు తగ్గిస్తామని, విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి తుంగలో తొక్కి 7సార్లు విద్యుత్ చార్జులు పెంచారని విమర్శించారు. కేంద్రం చెప్పిన విద్యుత్ చట్టానికి ఆమోదం తెలిపి వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన వ్యవసాయానికి ఇచ్చిన ఉచిత విద్యుత్‌ను మీటర్ల పేరుతో రైతులకు ఉచిత విద్యుత్ దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన గుండ్లకమ్మ రామతీర్థం రిజర్వాయరు గేట్లు దెబ్బతిన్నప్పటికీ మరమ్మతులకు నోచుకోలేదన్నారు. అదేవిధంగా గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి 80 వేల ఎకరాలకు సాగు నీరు అందించవలసి ఉండగా పిల్ల కాలువలు పూర్తికాక ఒక్క ఎకరానికి కూడా నీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. మతోన్మాదం, అధిక ధరలతో దేశాన్ని నాశనం చేస్తున్న బిజెపికి భజన చేస్తున్న అధికారపార్టీ వైసిపి, ప్రతిపక్షం తెలుగుదేశం, జనసేన పార్టీలకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ సమస్యలపై చర్చించేందుకు ఆదివారం మండల కేంద్రమైన నాగులుప్పలపాడులో సమరభేరి సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాహసరావుతో పాటు జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తొలుత సమరభేరి జాతా మండలంలో నిడమానూరు, పోతవరం, కండ్లగుంట, ఒమ్మెవరం, ఉప్పుగుండూరు, మాచవరం, రాపర్ల, అమ్మనబ్రోలు, చీర్వానుప్పలపాడు, చదలవాడ, నాగులుప్పలపాడు తదితర గ్రామాల్లో పర్యటించింది. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాలం సుబ్బారావు, యు ఆదిలక్ష్మి, బి రఘురామ్, ఎన్ వెంకటేశ్వర్లు, టి శ్రీకాంత్, జి బసవపున్నయ్య, యు వెంకటేశ్వర్లు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విఓఎలను కొనసాగించాలని 5న ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేసి తొలగించిన వివోలను కొనసాగించాలని ఏపీ వెలుగు వివోఏ యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు గంటెనపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. వివోఏ సమస్యలపై ఈ నెల 5వ తేదీన ఒంగోలు పీడీ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, అనుబంధ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ వివోఏలు అనేక సంవత్సరాల నుంచి పొదుపు గ్రూపులను ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విశేషమైన పాత్ర పోషించారన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి శేషయ్య, ఐఎన్‌టియుసి జిల్లా నాయకులు ఉంగరాల శ్రీను, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ నాయకులు శ్రీరామ శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమ్మీ, ఒంగోలు ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి నరసింహారాజు సుబ్రహ్మణ్యేశ్వరరావు కెవిపిఎస్ జిల్లా నాయకులు అత్తింటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విఒఎ సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు జి శ్రీనివాసులు



మద్దాళి మాధవరావుకు అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

మద్దాళికి పురస్కారం అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి: అభయకళారాధన సంస్థ అధ్యక్షులు మద్దాళి మాధవరావు శంకర దయాళశర్మ స్ఫూర్తిసేవా పురస్కారం అందుకున్నారు. శనివారం హైదరాబాదులో శెట్టి బలిజ భవన్‌లో తరుణీ డెవలప్‌మెంట్ సొసైటీ మరియు లిటిల్ ఛాంప్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పురస్కారం అందుకున్నారు. మద్దాళి మాధవరావు గత ఇరవై ఏళ్లుగా వివిధ రంగాలలో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో ఆయనకు సర్టిఫికేట్ మరియు సత్కారం అందజేశారు. కార్యక్రమంలో సినీ దర్శకులు నరసింహనంది, మహిళా సంఘం అధ్యక్షురాలు పద్మిని, గ్రేస్ ఫౌండేషన్ నిర్వాహకులు షాలేమురాజు, సామాజికవేత్త విజయలక్ష్మి, అనిల్‌కుమార్, డాక్టర్ రామచంద్రరావు, డాక్టర్ బి నాగరాజు, బుచ్చేశ్వరరావు పాల్గొన్నారు.



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పెద్దారవీడు ఎస్ఐ రాజేష్

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

ప్రజాశక్తి-పెద్దారవీడు

ప్రకాశం జిల్లా ఎస్పీ మల్లికాగర్గ్ ఆదేశాల మేరకు ప్రతి శనివారం నిర్వహించే నో యాక్సిడెంట్ డే కార్యక్రమంలో భాగంగా పెద్దారవీడు ఎస్ఐ రాజేష్ తమ స్టేషన్ పరిధిలో నేషనల్ హైవేపై ఉన్న మూలమలుపులులలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తూ వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వేగం కన్నా ప్రాణం ఎంతో విలువైనదని, దానిని కాపాడుకోవడమే మన అందరి బాధ్యత అని వాహనదారులకు సూచించారు. అనంతరం స్టేషన్ పరిధిలో ఉన్న హైవేపై ప్రమాదకర ఏరియాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రాచర్లలో కేక్ కట్ చేస్తున్న జనసేన కార్యకర్తలు

ప్రజలు జనసేన పక్షాన నిలబడాలి

పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ

ప్రజాశక్తి-మద్దిపాడు

ప్రజలు జనసేన పక్షాన నిలబడాలని, పేద వర్గాలకు అండగా జనసేన పార్టీ ఉందని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ పేర్కొన్నారు. శనివారం జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక జనసేన పార్టీ కార్యాలయ ఆవరణలో ఉదయం ఒంగోలు గవర్నమెంట్ హాస్పటల్ వారి సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఒంగోలు 38వ డివిజన్ కార్పొరేటర్ మల్గా రమేష్ ప్రారంభించారు. సాయంత్రం ఒంగోలు నగరానికి చెందిన ఉపాస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు గోనుగుంట్ల శ్రీనివాస్, డాక్టర్ నవీన్‌కుమార్, మండల అధ్యక్షులు నున్న బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఒంగోలు సబర్బన్: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు శనివారం ఒంగోలు నగరంలో ఘనంగా నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ భవన్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వల్లూరమ్మ గుడిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్ కటింగ్, జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేశారు. రాజపానగల్‌రోడ్డు, పాత కరెంటు ఆఫీసు వద్ద కేక్ కటింగ్ చేశారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, నగర అధ్యక్షులు మలగా రమేష్, పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాచర్ల: రాచర్ల మండలంలో జన సేనాని పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాచర్ల బస్టాండు, అన్నంపల్లే జంక్షన్, గుడిమెట్ట, ఆకవీడు గ్రామాల్లో జనసేన నాయకులు పెద్దఎత్తున పాల్గొని కేకులు కట్ చేశారు. కేకులు, అల్పాహారం భవన నిర్మాణ కార్మికులకు, కార్యకర్తలకు, ప్రజలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో తిరుమలశెట్టి వెంకట్రావు, అలిశెట్టి వెంకటేశ్వర్లు, కిరణ్, జనార్ధన్, బాలుడు, అరున్, జానీ తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలులో కేకు కట్ చేస్తున్న జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్

సతుకుపాడులో ఇసుక లారీల అడ్డగింత

పోలీసులకు పట్టించిన గ్రామస్తులు ● వైసిపి నేతల ఒత్తిడితో లారీలను వదిలేసిన పోలీసులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

జరుగుమల్లి మండలం, సతుకుపాడు గ్రామంలో అర్ధరాత్రి అక్రమంగా తరలించుకోబోతున్న ఇసుక లారీలను గ్రామస్తులు అడ్డుకున్న ఘటన శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సాగింది. మండలంలోని సతుకుపాడు గ్రామంలో జేపీ కంపెనీని నుంచి తొమ్మిది లారీలు వచ్చి ఇసుకను లోడ్ చేసుకొని తీసుకుపోతుండగా గ్రామస్తులు అడ్డుపడ్డారు. ఇటీవల కాలంలోనే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆ గ్రామంలో ఇసుక అక్రమంగా తరలిపోతుందని అధికారులు పట్టించుకోవటం లేదని కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రెండు రోజులు సైలెంట్ గా ఉన్న జేపీ కంపెనీ యాజమాన్యం మూడో రోజు అర్ధరాత్రి అక్రమంగా లారీలు ఇసుక తరలించేందుకు సిద్ధమయ్యారు. గ్రామస్తులు మొత్తం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోకూరు రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఆందోళన చేసి అర్ధరాత్రి లారీలను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. ఇన్‌ఛార్జి ఎస్ఐ టి శ్రీరామ్ ఆధ్వర్యంలో అక్కడకు చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. జేపీ కంపెనీ నుంచి ఇసుక పాలేరు నుంచి అక్రమంగా తరలించుకొని పోతున్నారని, దీనిపై ఇప్పటికే పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసి ఉన్నామని





ఇన్చార్జి ఎస్ఐ శ్రీరామ్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు (ఇన్‌సెట్‌లో) గ్రామస్తులు నిలిపివేసిన ఇసుక లారీ

వివరించారు. జేపీ కంపెనీ యాజమాన్యం ఇసుకను అడ్డగోలుగా తరలించుకొని పోతోందని పోలీసులకు వివరించారు. అయితే జేపీ కంపెనీ యాజమాన్యం కూడా కొందరు బందం అక్కడికి చేరుకొని తమకు అనుమతులు ఉన్నాయని సర్ది చెప్పే ప్రయత్నాలు చేసినప్పటికీ గ్రామస్తులు మాత్రం అనుమతులు లేవని అడ్డగోలుగా ఇసుకను తరలించుకొని పోతున్నారని లారీలను ఆపివేశారు. పోలీసులకు ఉన్నతాధికారులతో పాటు అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా ఫోన్లు చేసి జెపి కంపెనీ లారీలు ఆపేందుకు వీలు లేదంటూ ఆదేశాలు జారీ చేశారు. ఓ పక్క గ్రామస్తులు ఆందోళన చేస్తుంటే అర్ధరాత్రి సమయంలో పోలీసులు అడ్డంగా ఉండి.. ఆ లారీలను గ్రామస్తుల ముందే పంపించడం చర్చానీయాంశంగా మారిపోయింది. వైసీపీ నాయకుల హడావుడి దెబ్బకు పోలీసులు లారీలను ఇసుకతో సహా అనుమతులు లేకపోయినా తరలించడం జరిగింది. తెలుగుదేశం పార్టీ నాయకులు ఓ పక్క గ్రామస్తులు అనుమతులు లేవని చెబుతున్నప్పటికీ జేపీ కంపెనీకి వైసీపీ నాయకులతో పాటు అధికారులు కూడా అడ్డంగా నిలబడి అక్రమ ఇసుక లారీలను తరలించడం జరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఓ పక్క జిల్లా గనుల భూగర్భశాఖ అధికారి బి జగన్నాథరావు జేపీ కంపెనీకి జరుగుమల్లి మండలంలో ఇసుక తరలించేందుకు ఎలాంటి అనుమతులూ లేవని సమాచారం. చట్టం ద్వారా ఇచ్చిన కాగితాన్ని కూడా పోలీసులకు చూపించినా ఉపయోగం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క అర్ధరాత్రి గ్రామస్తులు తరలించుకోబోతున్న ఇసుక లారీలను పట్టుకుంటే అరికట్టాల్సిన పోలీసులే దగ్గరుండి అనుమతులు లేకపోయినా లారీలు పంపించడం జరుగుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

ధ్వజ స్తంభం ప్రతిష్టాపనలో అపశృతి

కిందపడి ముక్కలైన వైనం ● పోలీసు పహారాలో కార్యక్రమం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పుల్లలచెరువు మండలంలోని తెల్లగట్ల గ్రామంలో రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. ధ్వజస్తంభాన్ని ఎత్తుతుండగా క్రేన్‌కు కట్టిన తాడు తెగిపడి ధ్వజ స్తంభం కింద పడి రెండు ముక్కలుగా విరిగింది. ఆ గ్రామంలో గ్రామస్తులందరూ చందాలు వేసుకుని కోటి రూపాయల వ్యయంతో రామాలయాన్ని నిర్మించుకున్నారు. మరో నాలుగు లక్షల వ్యయంతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించేందుకు సిద్ధం చేసుకున్నారు. కాగా ఆ గ్రామంలోని ముదిరాజు వర్గానికి చెందిన కుటుంబీకులను ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవానికి రాకుండా అడ్డుకునేందుకు గ్రామస్తులు సిద్ధమయ్యారు. ఈ విషయం గ్రామం మొత్తం వ్యాపించింది. దేవుడి కార్యక్రమంలో అడ్డు పెట్టడం ఏమిటని ముదిరాజు వర్గం వారు చర్చించుకొని రెవెన్యూ, పోలీస్ అధికారులకు ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని వినతి పత్రాలు పంపించారు. స్పందించిన పోలీస్ శాఖ శనివారం జరిగే ప్రతిష్ట మహోత్సవంలో యర్రగొండపాలెం ఎస్ఐ జి కోటయ్య ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. కులాలకు అతీతంగా అందరూ కలిసి ప్రతిష్ట జరుపుకోవాలని పోలీసులు గ్రామస్తులకు వివరించారు. అయితే ప్రతిష్ట జరిగే సమయంలో క్రేన్ తాడు తెగడంతో ధ్వజ స్తంభం కింద పడి రెండు ముక్కలు అయ్యింది. అదృష్టవశాత్తు ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు. కాగా ముదిరాజు వాళ్లను పిలవనందున ఈ రకంగా జరిగిందని పలువురు చర్చించుకుంటున్నారు.



రెండు ముక్కలుగా విరిగిన ధ్వజస్తంభం



వెంకటరావుకు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శిగా వెంకటరావు

ప్రజాశక్తి-ఒంగోలు

ప్రకాశం జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు నూతన కార్యదర్శిగా వై వెంకటరావు నియమితులయ్యారు. పొదిలి మండలం పి ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఆయనకు ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం నాడు ఒంగోలులో బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

గ్రామ సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

గిద్దలూరు శాసనసభ్యులు అన్నా రాంబాబు శనివారం గిద్దలూరు మండలం గడికోట గ్రామంలో నూతనంగా నిర్మించిన నూతన గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలు ఆయా గ్రామాల పరిధిలోనే వారి సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వాలంటీర్లు, సచివాలయాల ద్వారా నేరుగా ప్రజల ఇంటివద్దకే చేరవేయడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నాను పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గుర్రపడియలో వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే స్వామి, పూర్ణచంద్రరావు, జనార్ధన్

వధూవరులకు ఎమ్మెల్యే స్వామి ఆశీర్వాదం

ప్రజాశక్తి-కొండపి: కొండపిలోని కామేపల్లి రోడ్డులో ఉన్న సాయిసీతారామ కళ్యాణ మండపంలో గోగినేని వెంకటనారాయణ, శ్రీదేవిల కుమార్తె వెంకట గాయత్రి, వీరమోసు మస్తాన్, శోభారాణి కుమారుడు హరీష్ వివాహ వేడుకలలో ఎమ్మెల్యే స్వామి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అలాగే మండలంలోని గుర్రపడియ గ్రామానికి చెందిన మేకల బలరామిరెడ్డి, సుబ్బాయమ్మ కుమారుడు అశోక్‌రెడ్డి వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, ఎమ్మెల్యే స్వామి, దామచర్ల పూర్ణచంద్రరావు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జి రామయ్య చౌదరి, బత్తుల నారాయణస్వామి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, నరసారెడ్డి, బూదవాటి సోమయ్య, రావిపాటి వెంకటరావు, కాశయ్య, మారెడ్డి సుబ్బారెడ్డి, అబ్బిరెడ్డి, మిట్టపాలెం టిడిపి నాయకులు, మండలంలోని నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు యువత మాజీ అధ్యక్షులు మృతి

ప్రజాశక్తి-దరిశి: తాళ్లూరు మండలం తూర్పుగంగవరం గ్రామానికి చెందిన మాజీ తెలుగు యువత అధ్యక్షులు, ఎల్ఐసి ఏజెంటు యాడిక శ్రీనివాసరెడ్డి(51) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యే పాపారావు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, ఎల్ఐసి ఏజెంట్లు సంతాపం ప్రకటించారు.



శ్రీనివాసరెడ్డి (ఫైల్)

మన చేతుల్లో మన ఆరోగ్యం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మన చేతులు ఎన్నో బాక్టీరియాలు, వైరస్‌లకు నిలయమని కస్తూర్బా గాంధీ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎస్ తిరుమలాదేవి అన్నారు. శనివారం ఆ పాఠశాలలో శనివారం స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినుల చేత చేతులు శుభ్రం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరచేతులు, వేళ్ల సందులను సబ్బు లేదా లోషన్‌తో రుద్దుకోవాలని అన్నారు. మురికి గా ఉన్న చేతులతో భోజనం చేస్తే వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్, పచ్చకామెర్లు వంటి జబ్బులు వస్తాయన్నారు. శుభ్రపరచుకున్న చేతులతో ఆహారం తీసుకుంటే ఎలాంటి క్రిములు కడుపులో చేరవని, ఆరోగ్యంతో పాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ విద్యాలయ ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



వేగినాటి కోటయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

వేగినాటి కోటయ్య సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పూర్వపు యర్రగొండపాలెం సమితి అధ్యక్షులు దివంగత వేగినాటి కోటయ్య సేవలు మరువ లేనివని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. శనివారం యర్రగొండపాలెంలోని 565 జాతీయ రహదారిలో ఉన్న దివంగత వేగినాటి కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి 33వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ కోటయ్య వెనుకబడిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన కృషి ఫలితంగానే ఈ ప్రాంత అభివృద్ధి జరిగిందని అన్నారు. మూడుసార్లు సమితి ప్రెసిడెంట్‌గా పని చేశారని చెప్పారు. ఎమ్మెల్యేగా గెలవాలని కోరిక ఉండేదన్నారు. అయితే కొద్ది ఓట్ల తేడాతోనే ఆయన దర్శి నియోజకవర్గం నుంచి ఓడిపోయినట్లు వివరించారు. జిల్లా పరిషత్ చైర్మన్ కావాలనే కోరిక నెరవేరలేదని తెలిపారు. ఆయన మరో 30 ఏళ్లపాటు బతికుంటే ఈ ప్రాంతం మరెంతో అభివృద్ధి సాధించేదని పేర్కొన్నారు. ఆయన లేని లోటు ఈ ప్రాంతానికి తీరనిదన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటానని చెప్పారు. అనంతరం పేదలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమారుడు వేగినాటి శ్రీనివాస్, టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, టిడిపి నాయకులు శనగా నారాయణరెడ్డి, మాబు, రవణమ్మ, మంత్రూ నాయక్, చీదెళ్ల నాగేశ్వరరావు, గోళ్ల సుబ్బారావు, కోట డేవిడ్, చెవుల అంజయ్య, అడుసుమల్లి రామచంద్రయ్య, ఎస్ఎండి యూసుబ్, వడ్లమూడి లింగయ్య, కామేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొండపిలో కరెంటు బిల్లులు దహనం

ప్రజాశక్తి-కొండపి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి బడుగు బలహీన వర్గాలపై కరెంటు బిల్లులు విపరీతంగా పెంచి పేదల ప్రజలపై అధిక భారాలు మోపుతున్నారని సిపిఎం కొండపి మండల కార్యదర్శి కెజి మస్తాన్ అన్నారు. శనివారం కొండపిలోని ఆర్టీసి బస్టాండ్ ఆవరణలో కరెంటు బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా కెజి మస్తాన్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలని కోరారు. ప్రజాపంపిణీ ద్వారా కందిపప్పు, నూనె ఇతర సరుకులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పట్టణ ఉపాధి హామీ పథకం కావాలి, గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని 100 రోజులు అమలు చేసి నిధులు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు రూబేను, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.



కొండపి బస్టాండ్ వద్ద కరెంటు బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

దరిశి: నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, విద్యుత్ ఛార్జీలు, అధిక ధరలు తగ్గించాలని సిపిఎం దరిశి మండల కార్యదర్శి తాండవ రంగారావు అన్నారు. శనివారం దరిశి 4వ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సుజాతకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కనీసం లక్షల ఉద్యోగాలు ఇవ్వకపోగా అనేక రంగాలలో కోటి 50 లక్షల మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందు వెంకటేశ్వరరావు, కెవి పిచ్చయ్య, ఇజ్రాయిల్, చలమయ్య, చిన్నగురవయ్య పాల్గొన్నారు.



దరిశి 4వ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

అర్హులైన పేదలందరికీ లబ్ధి

కొండపి వైసీపీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు

ప్రజాశక్తి-టంగుటూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంకల్పంతో అర్హత కలిగిన నిరుపేదలందరికీ లబ్ధి చేకూరుతుందని కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశపు హాలులో మండలంలో నూతనంగా మంజూరైన 250 మంది పింఛన్ దారులకు అశోక్‌బాబు చేతుల మీదుగా నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పేదల జీవన విధానం క్రమేపీ మారుతోందన్నారు. వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. గత టీడీపీ హయాంలో కొత్తగా ఒకరికి పెన్షన్ రావాలంటే మరొకరి చావు కోసం ఎదురుచూసే దౌర్భాగ్యం పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఎంతమంది అయినా సరే అర్హులైతే చాలు జగన్ ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందని అన్నారు. నూతనంగా మంజూరైన ఫించన్‌లలో స్థానిక బుడబుక్కల కాలనీకి చెందిన ఇద్దరు మానసిక వికలాంగులైన చిన్నారులకు మొట్టమొదటిగా పంపిణీ చేయడం ఎంతో సంతృప్తి నిచ్చిందని అశోక్‌బాబు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి రత్నజ్యోతి, ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ, ఎంపీటీసీలు బొడ్డు వాసంతి - రవీంద్ర, కొమ్ము ప్రభుదాసు, ప్రజాప్రతినిధులు ఉప్పలపాటి శివరామరాజు, పంచాయతీ కార్యదర్శులు య అరుణ కుమారి, యేజర్ల పద్మ, షేక్ జరీనా, జెవి శ్రీనివాసరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, మండలంలోని పలు గ్రామాల నుంచి విచ్చేసిన పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.



వికలాంగ చిన్నారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న అశోక్‌బాబు

ప్రజాశక్తి
7
ఆదివారం 03 సెప్టెంబర్ 2023



వివాహ వేడుకల్లో ఎంఎల్ఎ గొట్టిపాటి రవి

వివాహ వేడుకల్లో గొట్టిపాటి

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన పునుగోటి ముసలయ్య, వెంకట రమణ దంపతుల కుమారుని వివాహం శింగరకొండ రోడ్డులోని కూకట్ల కన్వెన్షన్‌లో జరిగాయి. ఈవివాహ వేడుకకు ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ హాజరై నూతన దంపతులు హరీష్ బాబు, శ్రీనివాస సురేఖను ఆశీర్వదించారు.

టీచర్ల అక్రమ బదిలీలతో అపహాస్యం

ప్రజాశక్తి - బాపట్ల

ఎన్నో పోరాటాలు అనంతరం ఉపాధ్యాయులు సాధించుకున్న బదిలీల కౌన్సిలింగ్ విధానాన్ని ప్రభుత్వం అపహాస్యం చేస్తూ బదిలీల తంతు ముగిసినా బ్లాక్ చేసిన ఖాళీల్లో అక్రమ బదిలీలకు పూనుకోవడం దారుణమని బాపట్ల జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు జె వినయ్ కుమార్, అడుగుల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. ఈపాటికే చేసిన అక్రమ బదిలీలను రద్దు చేయాలన్నారు. ఇకపై ఉపాధ్యాయుల అక్రమ బదిలీలకు ప్రభుత్వం పాల్పడబోదని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అనుమతి లేకుండా బయో మందులు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి - పర్చూరు

బయో మందులు ఇష్టం వచ్చినట్లు అమ్మటానికి వీలు లేదని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని ఎఒ ఎస్ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. న్యాయ స్థానం ఉత్తర్వులు చూపి గతంలో జీవ రసాయన మందులు అమ్మకాలు చేసేవారని అన్నారు. ప్రస్తుతం అలాంటి అవకాశం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బయో ఉత్పత్తులను ఫెర్టిలైజర్స్ కంట్రోల్ ఆర్డర్ పరిధిలోకి తెచ్చినందున ఫారంఒ నమోదు చేయించుకోవాల్సిందేనని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసే జీవన్, జీటు, జిత్రీ లైసెన్సులు కలిగి ఉన్న కంపెనీలు మాత్రమే అమ్ముకోవడానికి అనుమతి ఉంటుందని అన్నారు. వ్యాపారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

సురేష్‌కు స్టార్ గోల్డెన్ అవార్డు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా స్టార్ గోల్డ్ అవార్డు 2023ను మండలంలోని పెసర్లంక గ్రామానికి చెందిన యన్నం సురేష్‌కు హైదరాబాద్ గ్రేస్ ఫౌండేషన్ లిటిల్ ఛాంపియన్ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. ఫౌండేషన్ ప్రచార కమిటీ చైర్మన్‌గా ఉన్న యన్నం సురేష్ పూర్తి చొరవతో చేపట్టిన కార్యక్రమాలకు అవార్డును ఇస్తున్నట్లు అకాడమి చైర్మన్ బుక్కేశ్వరరావు అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఫౌండేషన్ కార్యక్రమాల్లో ఏపీలో సురేష్ చేస్తున్న సేవలను గుర్తింపుగా అవార్డు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధినేత కైతేపల్లి సాలెంరాజ్, తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పద్మజా గౌడ్, ప్రముఖ ఫిలిం డైరెక్టర్ నరసింహనంది, రైతు బ్రతుకు సినిమా డైరెక్టర్, సినీ హీరో నరేష్ గౌడ్ పాల్గొన్నారు.

డాక్టర్ వైఎస్ఆర్‌కు ఘన నివాళి



అన్నదానం ప్రారంభిస్తున్న కోన రఘుపతి

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

డాక్టర్ వైఎస్ఆర్ 14వ వర్ధంతి సందర్భంగా శనివారం వైఎస్ఆర్‌కు ఘన నివా ళులర్పించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి అధ్వర్యంలో పట్టణంలోని మూర్తిరక్షణనగర్, డీఎంపల్లి, టీచర్స్ కాలనీ, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అన్నదానం, వికలాంగులకు ఉపకర ణాలు పంపిణీ చేశారు.

బాపట్ల : మండలంలోని స్టువర్టుపురంలో డాక్టర్ వైఎస్ఆర్ 14వ వర్ధంతి సందర్భంగా ఎంపిపి చిన్నిపోతుల హరిబాబు ఆధ్వర్యంలో రైల్వే గేట్ వద్ద ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. 250మంది వృద్ధ మహిళల కు చీరలు, గురుకులంలో విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మొగిలి మధు, పాకాల రాజేష్, రాగాల అనిల్, బల్లాని నాగరాజు, దేవర కిరణ్, దేవరకొండ మధు, జాన్ గోయి, రఘు, కంపా కిరణ్, మొగిలి ప్రేమ్ చంద్, మేనపాటి శ్యామ్, కర్రెద్దుల శ్రీను, శ్రీరాముల నాగరాజు పాల్గొన్నారు.

రేపల్లె : మనసుంటే ప్రజలకు ఎంత మేలు చేయవచ్చో చేతల్లో చూపించిన మహానేత డాక్టర్ వైఎస్ఆర్ అని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ 14వ వర్ధంతిని బస్టాండ్ సెంటర్లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్య బాబు, మున్సిపల్ చైర్మన్ కట్ట మంగా సుబ్బారావు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : డాక్టర్ వైఎస్ఆర్ 14వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వేమూరులో పిఎసిఎస్ చైర్మన్ గాజుల భాను ప్రకాష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి, భట్టిప్రోలు ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీపీ డివి లలిత కుమారి, జడ్పిటిసి టి ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్‌కు నివాళు లర్పించారు.

చీరాల : డాక్టర్ వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయమని వైసిపి ఇన్చార్జ్ కరణం వెంకటేష్ బాబు అన్నారు. స్థానిక గడియార స్థంభం సెంటర్లోని డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, పలువురు కన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పర్చూరు : డాక్టర్ వైఎస్ఆర్ బ్రతికి ఉంటే రాష్ట్ర విభజన జరిగి ఉండేది కాదని వైసిపి ఇంచార్జి ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా ర్యాలి చేశారు. బొమ్మల సెంటర్లోని డాక్టర్ వైఎస్ఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తోకల కృష్ణమోహన్, కోటా హరిప్రసాద్, ఎర్రాకుల తిరుమలేశ్వ రరావు, తులసి నాగమణి, గాదె సురేష్, జంగా అనిల్, మల్లా శ్రీనివాసరావు, ఆకుల హేమంత్, కూరాకుల ఇస్సాకు, నూతలపాటి బలరాం, జూపూడి రోశయ్య, షేక్ గౌస్ బాషా పాల్గొన్నారు.

నగరం : డాక్టర్ వైఎస్ఆర్ పేదల పెన్నిదని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. వైఎస్ఆర్ 14వ వర్ధంతిని శనివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. నగరం ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామకృష్ణ, వైసీపీ జిల్లా కార్యదర్శి నిజాంపట్నం కోటేశ్వరావు పాల్గొన్నారు.

ఘనంగా పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు



జన్మదిన కేక్ కట్ చేస్తున్న జన సైనికులు

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మ దిన వేడుకలు శనివారం పట్టణంలో ఘనంగా జరిగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన సంయుక్త కార్యదర్శి నామన వెంకట శివన్నారాయణ ఎర్పాటు చేసిన కేకును కట్ చేసి పంపిణి చేశారు. పవన్ అభిమానులు పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

అద్దంకి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు గోరంట్ల సాయి ఆధ్వర్యంలో ఘనంగా శనివారం నిర్వహించారు. చైతన్య భదిరుల ఆశ్రమం పాఠశాలలో అన్న దానం చేశారు. కార్యక్రమంలో గోరంట్ల సాయి, బత్తుల చందు, శ్రీనివాస చారి, సుభాని, వీరాంజనేయులు, మురళి, వీరాచారి, కోటి, సాంబశివరావు, కిరణ్, సుబ్బారావు, మణికంఠ, జాను, బస్వ, రాజేష్, రాజు, నాగమల్లేశ్వరావు, వంశీ కృష్ణ, గోపి, శ్రీను, రామ్ చరణ్ పాల్గొన్నారు.

చెరుకుపల్లి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాలలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. చెరుకుపల్లి పోలేరమ్మ గుడి వద్ద, ఆరుంబాకలో వీరమహిళలు 52కేజీల కేకును కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకులు మత్తి భాస్కరరావు, జనసేన మండల అధ్యక్షుడు సురేష్, మొఖమాటం పృధ్వి, ఉల్లగుంట శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో రైతులకు అవస్థలు: ఎంఎల్ఎ గొట్టిపాటి



రైతులతో మాట్లాడుతున్న గొట్టిపాటి రవి

ప్రజాశక్తి- సంతమాగులూరు

విద్యుత్ చార్జీల మోత మోగిస్తున్న వైసిపి ప్రభుత్వం కోతలతో రైతుల నడ్డి విరుస్తుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కామేపల్లి, వెల్లలచెరువులో వివాహ వేడుకలకు హాజరైన ఆయన రైతులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలైనా బోర్ల ద్వారా పంటను తడుపుదామన్నా కరెంటు ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ పీకేస్తున్న సిఎం జగన్‌ను ఆ పదవి నుండి పీకేందుకు జనం సిద్ధంగా ఉన్నారని గొట్టిపాటి అన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, చేవూరి వాసురెడ్డి, గాడిపర్తి రామకృష్ణ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : జగన్ అసమర్ధ పాలనతో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి టి సాయి బాబా అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రానికి సరిపడా విద్యుత్తు పోను మిగులు చూపారని గుర్తు చేశారు. వేలా పాల లేని విద్యుత్ కోతలు నివారించాలని కోరారు. సమావేశంలో టిడిపి నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, ఆదిన బసవ పున్నయ్య, సిరాజుద్దీన్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - బాపట్ల

గర్భస్థ పిండ లింగ నిర్ధారణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాపట్ల ఆర్‌డిఒ జి రవీంద్ర సూచించారు. వైద్యారోగ్య శాఖ అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలను అరికట్టాలని అన్నారు. చట్ట విరుద్ధంగా స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నిరంతరం స్కానింగ్ సెంటర్లను పర్యవే క్షించాలని అన్నారు. సమావేశంలో జిల్లా ఇమ్యు నైజేషన్ అధికారి వెంకటేశ్వర్లు, ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారిణి ఎం సౌజన్య, ఏపీపీ మహేంద్రనాథ్ , డిఎస్‌పి వెంకటేశులు, ఎన్జీవో ప్రసాదరావు, బి మరియమ్మ, సిహెచ్ఓ నాగేశ్వరరావు, ప్రమీల, హెచ్‌వి పాల్గొన్నారు.



ఆరోగ్య శాఖ అధికారులతో ఆర్‌డిఒ



జగనన్న పాలవెల్లువ రుణ పత్రాలు ఇస్తున్న అధికారులు

'జగనన్న పాలవెల్లువ' రుణమేళా

ప్రజాశక్తి - అద్దంకి : మండలంలోని గోవాడ గ్రామంలో జగనన్న పాలవెల్లువ రుణ మేళా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎహెచ్ఓ హనుమంతరావు మాట్లాడుతూ రైతులు కొత్త గేదెలు కొనుగోలుకు, పశు గ్రాసం, పాడి రైతులు, పశు పోషకులకు సలహాలు, సూచనలు చేశారు. మహిళా డైరీ సహకార సంఘాలకు రుణాలు, రుణాల విశిష్టతను తెలిపారు. పిడిసిసిబి సిఈఓ జనరల్ మేనేజర్ ప్రసాదరావు, వెలుగు ఏపీఎం, పిహెచ్ఈజిపి ఇచ్చిన మినీ డైరీ ఫార్మ్ వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి డిసిఓ పి రామారావు, డిఆర్‌డిఏ పిడి అర్జునరావు, ఎంపిడిఒ దేవసేన కుమారి, పశుసంవర్ధక శాఖ ఏడి మోహనరావు, విఏఎస్ బొమ్మనంపాడు, సర్పంచి, సిబ్బంది సొసైటీ పాల్గొన్నారు.



పోస్టర్ ప్రజెంటేషన్ పరిశీలిస్తున్న డైరెక్టర్ సి సుబ్బారావు

పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు

ప్రజాశక్తి - వేటపాలెం : సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పోస్టర్ ప్రజెంటేషన్‌పై పోటీలను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు తెలిపారు. కళాశాల టెక్నికల్ క్లబ్ ఆధ్వర్యములో మానవ జీవితముపై ఆర్టిఫిషి యల్ ఇంటలిజెన్స్ ప్రభావం వంటి అంశాలపై విద్యార్థు లకు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీ నిర్వహించినట్లు తెలిపారు. పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలో 53టీములు పాల్గొన్నట్లు తెలిపారు. పోస్టర్ ప్రజెంటేన్ పోటీలకు జి శ్రీనివాసరావు, డి శివబాస్కర్ కన్వినర్లుగా వ్యవహరించారు.

అందరూ చిత్రకారులు కావాలి

ప్రజాశక్తి - వేటపాలెం : ప్రతి ఒక్క విద్యార్థి చదువుతోపాటు చిత్రకళను అలవాటు చేసుకోవాలని వైసిపి ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. స్థానిక ఓఆర్ఎస్ పాఠశాల నందు శనివారం శ్రీ శారద చంద్ర కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో బొమ్మలు గీయటం ఎలా అనే బుక్స్ పంపిణీ చేశారు. బొమ్మలు గీయటంలో మెళకువలను ఆర్ట్ బార్ డైరెక్టర్ ఎన్ రాజశేఖరరెడ్డి వివరించారు. రచయిత సజ్జా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓఆర్ఎస్ పాఠశాల ఏర్పాటు, చంద్రరెడ్డి కుటుంబానికి ఉన్న అనుబంధం వివరించారు. పాఠశాల పూర్వ విద్యార్థిని పరాల వెంకట సింధుశ్రీ భరతనాట్య ప్రదర్శనతో విద్యార్థులను అలరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ జెవి సుబ్బయ్య, ఓఆర్ఎస్ పాఠశాల హెచ్ఎం నిరూపమ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖరరెడ్డి, పేరెంట్స్ కమిటీ ప్రతినిధి నాయుడు మస్తాన్‌రెడ్డి, ఆర్టిజిఎస్ నాగార్జున, కళాకారులు ఎస్ఎం షరీఫ్ పాల్గొన్నారు.

వివోఏ జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - బాపట్ల : విఒఏ సంఘం జిల్లా నూతన కమిటీ ఎంపిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం జరిగిన విఒఏల జిల్లా కమిటీ ఎన్నికలో జిల్లా గౌరవ అధ్యక్షులు సిహెచ్ మజుందార్, జిల్లా అధ్యక్షురాలు టి పుణ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కె లక్ష్మి, జిల్లా కోశాధికారి జె జ్యోతి తోపాటు మరో 12మంది ఆఫీస్ బేరర్స్, 25మందితో జిల్లా కమిటీ ఏర్పడింది. సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని విఒఏల సమస్యలపై ఈనెల 5న వెలుగు పీడీ కార్యాలయం వద్ద జరుగనున్న ధర్నా జయప్రదం చేయాలని తీర్మానించారు.

సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం తగదు

జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న 106 నీటిపారుదల ప్రాజెక్టులపై నిర్లక్ష్యం తగదని ప్రకాశం జిల్లాకు జీవనాడులుగా ఉన్న వెలిగొండ, గుండ్లకమ్మ ప్రాజెక్టులను సత్వరం అభివృద్ధి చేయాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో శనివారం వెలిగొండ, గుండ్లకమ్మ ప్రాజెక్టులపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రకాశం జిల్లాలో వ్యవసాయ యోగ్యమైన భూమి 16,50,000 ఎకరాలు ఉండగా సాగునీరు అందుతున్న భూమి 10,50,000 ఎకరాలకు మాత్రమేనని తెలిపారు. 3,36,000 ఎకరాలకు ప్రకాశం జిల్లాలో నీరందించగల పూల వెంకటసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాకపోవటం ప్రకాశం జిల్లా రైతాంగానికి శాపంగా మారిందన్నారు. కందుల ఓబుల్ రెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్ 80 వేల ఎకరాలకు నీరు అందించే సామర్థ్యం ఉన్నప్పటికీ ఆచరణలో గేట్లకు మరమ్మతులు చేయకపోవడం వల్ల రైతాంగం నిరాశకు గురయ్యారన్నారు. గత 13 నెలలుగా గుండ్లకమ్మ ప్రాజెక్టు మూడవ గేటును రిపేర్ చేయించలేకపోతుందని, ఆరు సార్లు టెండర్లు పిలిచినా ఒక్క కాంట్రాక్టర్ ముందుకు రావటం లేదన్నారు. 15 గేట్ల మరమతులకు రూ.10 కోట్లు అవసరం కాగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా వ్యవసాయ రంగ, నీటిపారుదల నిపుణులు అక్కినేని భవానీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో బలమైన రాజకీయ నాయకత్వం లేకపోవడంతో వెనుకబడిన జిల్లాగా కొనసాగుతుందన్నారు. ప్రకాశం జిల్లాలో సగటున కురిసే వర్షపాతం లో సుమారు 540 శతకోటి ఘనపు అడుగుల నీరు లభిస్తున్నా ఆ నీటిని నిల్వ చేసుకునే రిజర్వాయర్లు, చెరువులు లేకపోవడం శోచనీయమన్నారు. అనంతరం ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు, సిపిఐ నేత వడ్డే హనుమా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం మాట్లాడారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేత కామేపల్లి శ్రీనివాసరావు, నరసం గౌరవ అధ్యక్షురాలు టి.అరుణ, వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు మాగులూరి నాగేశ్వరరావు, జనవిజ్ఞానవేదిక అధ్యక్షులు చిట్టెం వెంకటేశ్వర్లు, సుపరిపాలన వేదిక కార్యదర్శి నాగభూషణం, పౌర సమాజం కన్వీనర్ నర్సింగరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వి.లక్ష్మణరెడ్డి

ధరల భారాలపై పోరు



నిత్యావసర సరుకుల ధరలను అదుపుచేయాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్ ధరలను అదుపు చేయాలని, కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న భారాలు తగ్గించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం నిర్వహిస్తున్న సమరభేరిలో భాగంగా ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో దశలవారీ ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి వల్ల ధరలు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయి. రాష్ట్రంలో నూతన విద్యుత్ పాలసీకి లోబడి పెద్దఎత్తున విద్యుత్ ఛార్జీలు పెంచుతున్నారు. పలు రకాల పేర్లతో ప్రజల నుంచి అత్యధికంగా విద్యుత్ ఛార్జీలు వసూలు చేస్తున్నారు. గతంలో రూ.400 ఉన్న వంట గ్యాస్ ధరను కేంద్ర ప్రభుత్వం రూ.1200కు పెంచింది. ప్రస్తుతం రూ.200 తగ్గిస్తూ గ్యాస్ ధర తగ్గించామని చెబుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలూ రోజురోజుకూ పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలు కడుపు నిండా తిండి కూడా తినలేని దుస్థితిలో ఉంటున్నారు. ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతున్నాయి.

ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా ప్రకటించి.. జిల్లా అభివద్ధికి రూ.10 వేల కోట్ల ప్యాకేజీని ప్రకటించాలని, జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం పోరుబాట కార్యక్రమానికి సిద్ధమైంది. డిమాండ్ల సాధన కోసం ప్రకాశం జిల్లాలో 14 రోజుల పాటు 300 కిలోమీటర్లు ప్రకాశం జిల్లాలో సిపియం నేతలు పాదయాత్ర చేయనున్నారు.

తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట కాలువలకు నీరు రాక ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పంటల సాగు ప్రశ్నార్థకం అయింది. ప్రస్తుతం సరైన వర్షాలు లేక డ్యాముల్లో నీరు పూర్తిగా అడుగంటాయి. ఈ కారణంగా కష్ణ పశ్చిమ డెల్టా పరిధిలో ఉన్న ఉమ్మడి ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో రైతులు ఇప్పటికే సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపట్టింది. రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని చెబుతున్నారు. కష్ణా, పశ్చిమ డెల్టా పరిధిలో 5 లక్షల 71 వేల ఎకరాలకు సాగునీటిని అందించాల్సి ఉండగా జులై 7వ తేదీన సాగునీటిని విడుదల చేయడం జరిగింది. అరకొరగానే రైతులు పంటల సాగు పనులు చేపట్టారు. కానీ వర్షాభావం కారణంగా శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో నీరు పూర్తిగా అడుగంటింది. సాగర్ కాలువ ద్వారా కూడా పంటలకు కావలసిన నీరు వచ్చే పరిస్థితి లేదు. ఈ కారణంగా ఇప్పటికే వరి పంట సాగు చేపట్టిన రైతులకు వారాబంధీ విధానంలో నీరివ్వనున్నారు.ఆరుతడి పంటలు సాగుకు రైతులు పూనుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది.

వాన్‌పిక్ ప్రాజెక్టు ఛైర్మన్ నిమ్మగడ్డ ప్రసాద్ వాన్‌పిక్ భూముల్లో రహస్యంగా పర్యటించారు. వాన్‌పిక్ కోసం భూముల సేకరణ సమయంలో కూడా ఇటువైపు రాని నిమ్మగడ్డ ప్రసాద్ ఎవరికి తెలియకుండా జిల్లాలోని తీరప్రాంత భూముల్లో పర్యటించారు. ప్రాజెక్టు భూములను స్వయంగా పరిశీలించారు. వాన్‌పిక్ భూముల స్వాధీనంపై సుప్రీంకోర్టు ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నిమ్మగడ్డ ప్రసాద్ వాన్‌పిక్ భూముల్లో రహస్యంగా పర్యటించారు. వాన్‌పిక్ ప్రాజెక్టును వేరే సంస్థకు అప్పజెప్పనున్నారని ఈ కారణంగానే సదరు భూముల పరిశీలన కోసం వచ్చారన్న ఊహాగానాలు వినిపించాయి.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా

జడ్పీ పాఠశాలలో ప్రిన్సిపల్ సెక్రటరీ తనిఖీ

ప్రజాశక్తి-కురిచేడు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ కురిచేడులోని వై.ఆర్.జడ్.పి. ఉన్నత పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. ఆ తరువాత ఉపాధ్యాయులతో మాట్లాడుతూ తరగతుల నిర్వహణ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. విద్యార్థుల సబ్జెక్ట్ పూర్తి చేయనందుకు ఆయన ఉపాధ్యాయులను మందలించారు. ఈ విధంగా విద్యాభ్యాసం చేస్తే చర్యలుంటాయని ఉపాధ్యాయులను ఆయన హెచ్చరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో వాలంటీర్లు, అధికారులతో కలిసి సమాచారాన్ని అడిగి తెలుసుకోవడానికి ప్రయత్నం చేశారు. మండలంలో విద్యార్థుల డ్రాపౌట్ సమస్యపై ఆయన వాలంటీర్లను, మండలస్థాయి అధికారులను తీవ్రంగా మందలించారు. అధికారులు, వాలంటీర్ల పనితీరు ఏమి బాగోలేదని పనితీరు మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కందుకూరు ఆర్.డి.ఒ తోట అజయ్‌కుమార్, ఎంఇఒలు వస్త్రాంనాయక్, సుబ్బారావు, ఇన్‌ఛార్జి యం.పి.డి.ఒ వసంతరావునాయక్, ఎంఆర్ఒ జ్వాలానరసింహ పాల్గొన్నారు.

దరిశి: స్థానిక కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని, దరిశి-2 సచివాలయంను రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటర్ ప్రవీణ్ ప్రకాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఆంజనేయులు, ఎంఇఒ కె రఘురామయ్య, ప్రిన్సిపల్ అరుణ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

2024లో వైసిపిదే విజయం

మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-త్రిపురాంతకం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను రద్దు చేస్తామని ప్రకటించి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయకుడు ఎన్నికలకు రావాలని, పథకాలను కొనసాగిస్తామని తాము ఎన్నికలకు వస్తామని, ప్రజలు ఎవరికి పట్టం కడతారో తేల్చుకుందామని రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం త్రిపురాంతకం మండలంలోని నడిగడ్డ గ్రామంలో రెండోరోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ముద్రించిన బుక్‌లెట్‌లను అందజేశారు. అనంతరం నడిగడ్డలో 50 కుటుంబాలు టీడీపీ నుంచి వైసీపీలోకి మంత్రి సురేష్ సమక్షంలో చేరారు. కార్యక్రమంలో ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపిపి ఆళ్ల ఆంజనేయరెడ్డి, జడ్పిటిసి మాకం జాన్‌పాల్, వైసిపి మండల కన్వీనర్ పోలిరెడ్డి, తహశీల్దార్ కిరణ్, ఎంపిడివో సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



ప్రజలకు బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి సురేష్

నివేదితకు
స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న గేరా నివేదిత స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రమణయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ జయంతి సందర్భంగా విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే గురు పూజోత్సవ కార్యక్రమంలో నివేదిత పాల్గొంటారన్నారు. స్టేట్ బెస్ట్ టీచర్స్‌గా ఎంపికైన వారిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, తదితర ప్రముఖుల చేతులమీదుగా అవార్డు ప్రధానోత్సవం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా టంగుటూరు మండలంలోని విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు, యూనియన్ల నాయకులు నివేదితకు అభినందనలు తెలియజేశారు.



నివేదిత

నేడు దాచూరి రామిరెడ్డి
వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జిబిఆర్ ఫౌండేషన్ సహకారంతో ఒంగోలు డిఆర్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో వైద్య శిబిరం ఆదివారం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందని మెడికల్ క్యాంపు కన్వీనర్ మాదాల వెంకటరావు తెలిపారు. మెడికల్ క్యాంపులో ప్రముఖ డాక్టర్లు గోపాళం శివన్నారాయణ, డాక్టర్ బి. హరిబాబు, డాక్టర్ చాపల వంశీకష్ణ, డాక్టర్ ఎల్.జాన్‌రిచర్డ్స్, డాక్టర్ యస్. ధీరజ్ బాబు, డాక్టర్ యస్.సందీప్ ప్రకాష్, డాక్టర్ జి. చైతన్య, డాక్టర్ ఎం.రవితేజ, డాక్టర్ జివి సుబ్బారెడ్డి పాల్గొంటారని తెలిపారు. రెండు నెలలకు సరిపడా అన్ని మందులూ రూ.200కు, తక్కువ ధరకు ఇన్సులిన్ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని బిపి, షుగర్, పక్షపాతం రోగులు వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు మాదాల వెంకటరావు (మెడికల్ క్యాంపు కన్వీనర్) మొబైల్ నెంబర్లు 9490300076, 9490324140 సంప్రదించాలని కోరారు.